# భయం

గోపీ అప్పుడే రైలుదిగాడు. అతని తల్లి చనిపోయి ఎక్కువ రోజులు కాలేదు. చనిపోయేముందు "తమ్ముళ్ళున్నారు బాబూ !" "చెల్లెలికి ఎటువంటి సంబంధం తెస్తావో?" అని తల్లి చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటూనే వున్నై.

అమ్మ పోయిన్నాటి రాత్రి, అంతా గొల్లున ఏడుస్తుంటే, "ఎందు కన్నయ్యా!" అని అడిగాడు పెద్దతమ్ముడు.

"వాళ్ళకు పిచ్చెత్తింది, వాళ్ళెప్పుడూ అంతే," అని చెప్పాడు గోపి.

గోపీ పెద్దతమ్ముడు చిన్నతమ్ముణ్ణి అడిగాడు-"అమ్మే దిరా?"

వాడు ఆకాశంవైపు చూపించాడు. అందులో గోపీకి వేదాంతం కనిపించింది. అమ్మ చచ్చిపోలేదు. చచ్చిపోయింది మనం. ఈలోకమంతా చచ్చిపోయింది. ఈ చచ్చిన లోకంలో నుంచి అమ్మ బతికింది.

కాని ఆ రాత్రి మాత్రం గోపీకి ప్రపంచం ఎడారిగా, శూన్యంగా, వల్లకాడుగా, భయంకరంగా కనిపించింది.

ఇవన్నీ జ్ఞాపకంవచ్చి, ఎరిగినవాళ్ళుగానీ, స్నేహితులుగానీ కనిపించి "మీ అమ్మకు ఎట్లా వుంది?"అని అడుగుతారేమో నని భయంవేసింది గోపీకి.

"కూలీ?" అని పిలిచాడు.

"బాబూ"

"పెట్టె తీసుకు రా"

"ఎక్కడకు బాబూ"

పేట పేరు చెప్పాడు గోపీ:

"అణా బాబూ"

"బేడ ఇస్తా, నాతో రా."

పెట్టె కూలీవాడి నెత్తిమీద పెట్టి పరధ్యానంగా బయల్దేరాడు గోపి. కూలీ గోపీ వెనక అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్తున్నాడు.

వర్షం కురవటానికి ప్రయత్నిస్తూవుంది. సూర్యుడు నాశనమైన చీకట్లో నక్షత్రాలు మెరుస్తున్నాయి. గోపీ కూలీ పిల్లవాడితో సంభాషణ మొదలు పెట్టాడు:—

"రోజుకి ఎంతొస్తుందిరా?"

"అర్ధణో, అణో వస్తుందండీ!"

"దాన్తో ఏం చేస్తావ్?"

"కొనుక్కు తింటాను."

"ఇంటిదగ్గర ఇవ్వవూ?"

"నాకు అమ్మా బాబూ లేరండీ! ఉంటే అట్లాగే ఇచ్చేవాణ్ణి."

"మరి నీకు పొట్ట ఎలాగురా గడవటం?"

"ఇక్కడ ఒక పోర్టరుకాడ వుంటున్నానండీ. ఆయనఇంట్లో పనిచేసి పెడతాను. అన్నం పెడతారు. రైలొచ్చినప్పుడు ఇట్లా కూలి మోస్తుంటాను. ఏ అణో వొస్తే కొనుక్కు-తింటాను. రాత్రిపూట రైలుస్టేషన్లోనే పడుకుంటానండీ..."

"ఎంత హాయి బ్రతుకురా," అనుకున్నాడు గోపి.

కాని అప్పట్నుంచే ఆపిల్లవాణ్ణి చూస్తే గోపీకి భయం.